### ఫాస్టాగ్ కేవైసీ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: ఫాస్టాగ్ యూజర్లు తమ కేవైసీ (మీ కస్టమర్ గురించి తెలుసుకోండి) వివరాలను అప్‌డేట్ చేయడానికి గడువును ఫిబ్రవరి 29 వరకు పొడిగించినట్లు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) బుధవారం ప్రకటించింది. వ్యాలిడ్ బ్యాలెన్స్ ఉన్న ఫాస్టాగ్స్‌కు కేవైసీ అసంపూర్ణంగా ఉంటే, వాటిని బ్యాంకులు జనవరి 31 తర్వాత డీయాక్టివేట్ చేస్తాయని ఈ నెల 15న ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒక వాహనానికి అనేక ఫాస్టాగ్స్‌ను ఉపయోగించడం కానీ, అనేక వాహనాలకు ఒకే ఫాస్టాగ్‌ను వాడటం కానీ జరగకుండా చూసేందుకు 'ఒక వాహనం, ఒకే ఫాస్టాగ్' విధానాన్ని ఎన్‌హెచ్‌ఏఐ అమలు చేస్తున్నది.

### కేంద్రం బకాయిలు.. విడుదల చేయకపోతే ధర్నా: మమత

మాల్దా, జనవరి 31: పశ్చిమబెంగాల్‌కు కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలను గురువారం నాటికి విడుదల చేయాలని.. లేనిపక్షంలో శుక్రవారం నుంచి స్వయంగా తానే ధర్నాకు దిగుతానని ఆ రాష్ట్ర సీఎం మమతాబెనర్జీ హెచ్చరించారు. బుధవారం ఆమె ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఒక్క లోక్‌సభ సీటు కూడా కేటాయించబోనని, ఆ పార్టీ సీపీఎంతో జతకట్టి బీజేపీకి లబ్ధిచేకూరుస్తున్నదని విమర్శించారు.

### విపక్షాలతో లింక్ ఉందని ఒప్పుకోవాలంటూ కరెంట్ షాక్

**పార్లమెంట్ కేసు నిందితుల వెల్లడి**

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం కేసు నిందితులు ఢిల్లీ పోలీసులపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ కేసులో తమకు విపక్ష పార్టీలతో సంబంధముందని ఒప్పుకోవాలంటూ చిత్రహింసలు పెడుతున్నారని ఐదుగురు నిందితులు అడిషనల్ సెషన్స్ జడ్జికి విన్నవించారు. తమచేత బలవంతంగా 70 ఖాళీ పేపర్లపై సంతకాలు పెట్టించుకున్నారని, ఈ ఘటనతో జాతీయ ప్రతిపక్ష పార్టీలకు సంబంధం ఉందని చెప్పాలంటూ తమను విద్యుత్తు షాకులు పెట్టి తీవ్రంగా హింసించారని ఆరోపించారు.

# జ్ఞానవాపి మసీదులో పూజలు


## అనుమతిచ్చిన వారణాసి జిల్లా కోర్టు

- మసీదు బేస్‌మెంట్‌లో విగ్రహాలు
- ఏడు రోజుల్లో పూజలకు ఏర్పాట్లు చేయాలి
- జిల్లా యంత్రాంగానికి కోర్టు ఆదేశం
- ఈ తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తాం
- అంజుమన్ ఇంతెజామియా కమిటీ
- 1993 వరకు మసీదులో పూజలు
- పూజారి సోమ్‌నాథ్ వ్యాస్ వారసుల వెల్లడి

వారణాసి, జనవరి 31: ఉత్తరప్రదేశ్‌లోని జ్ఞానవాపి మసీదు వివాదంలో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకొన్నది. మసీదు బేస్‌మెంట్‌లోని వ్యాస్ టిఖానా వద్ద ఉన్న హిందూ దేవతల విగ్రహాలకు పూజలు చేసుకొనేందుకు వారణాసి జిల్లా కోర్టు అనుమతి ఇచ్చింది. వారంలోగా పూజలు చేసుకొనేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని న్యాయమూర్తి ఏకే విశ్వాస్ ఆదేశించారు. 'జ్ఞానవాపి మసీదులో పూజలు నిర్వహించకుండా అడ్డుకొనేందుకు ఏ కారణమూ కనిపించటంలేదు. ఇకనుంచి ఇక్కడ కాశీ విశ్వనాథ్ ఆలయ ట్రస్టు పూజలు నిర్వహిస్తుంది. ఈ పరిణామంపై మేం గర్వపడుతున్నాం. ఇది మొదటి అడుగు మాత్రమే. ఈ తీర్పును ఎవరైనా సవాల్ చేస్తే సమాధానం ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం' అని హిందూ పిటిషనర్ల తరఫు న్యాయవాది మదన్‌మోహన్ యాదవ్ తెలిపారు. మసీదు కాంప్లెక్స్‌లో రెండుమూడు రోజుల్లో పూజలు మొదలుపెడుతామని కాశీ విశ్వనాథ్ ఆలయ చైర్‌పర్సన్ నాగేంద్ర పాండే చెప్పారు. ఇకపై అక్కడ రోజూ పూజలు నిర్వహిస్తామని వెల్లడించారు. పూజలు నిర్వహించే ప్రాంతాన్ని పరిరక్షించేందుకు అక్కడ ఒక తలుపు ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. సంపూర్ణమైన జ్ఞానవాపి ఆలయంలో పూజలు నిర్వహించాలని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నామని అన్నారు.

**1993 వరకు పూజలు!**

మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ ఆలయాన్ని ధ్వంసం చేసి మసీదు నిర్మించాడని ప్రచారంలో ఉన్న జ్ఞానవాపి మసీదులో 1993 వరకు పూజలు నిర్వహించినట్టు పిటిషనర్ శైలేంద్రకుమార్ పాఠక్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తన తాత సోమ్‌నాథ్ వ్యాస్ ఆ మసీదులోని హిందూ విగ్రహాలకు పూజలు నిర్వహించేవారని, 1993లో ములాయంసింగ్ యాదవ్ ప్రభుత్వ హయాంలో పూజలను నిలిపివేయించారని తెలిపారు. మళ్లీ అక్కడ పూజలు నిర్వహించుకొనేందుకు అవకాశం కల్పించాలని పిటిషన్‌లో కోర్టును కోరారు. మసీదులోని వజూఖానా ముందు ఉన్న నంది విగ్రహం వద్ద గతంలో ఏర్పాటుచేసిన బారికేడ్స్‌ను తొలగించాలని అభ్యర్థించారు. 'మసీదులోని విగ్రహాలకు శతాబ్దాలపాటు పూజలు కొనసాగాయి. 1993లో ములాయంసింగ్ ప్రభుత్వం విగ్రహాలకు అడ్డుగా బారికేడ్స్, ఇనుపకంచెను ఏర్పాటుచేసి హిందువులు పూజలు చేసుకోకుండా అడ్డుకొన్నది. ఇప్పుడు మళ్లీ పూజలు పునఃప్రారంభం కాబోతున్నాయి' అని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. 400 ఏండ్ల తమ తపస్సు ఫలించిందని పూజారి సోమ్‌నాథ్ వ్యాస్ మరో వారసుడు అశుతోష్ వ్యాస్ సంతోషం వ్యక్తంచేశారు.



బుధవారం వారణాసిలోని జ్ఞానవాపి మసీదు ముందు పోలీసుల పహారా

**హైకోర్టుకు వెళ్తాం: మసీదు కమిటీ**

జిల్లా కోర్టు తీర్పుపై జ్ఞానవాపి మసీదు బాధ్యతలు చూస్తున్న అంజుమన్ ఇంతెజామియా మస్జిద్ కమిటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సెల్లార్ ప్రాంతం కూడా మసీదు కాంప్లెక్స్‌లో భాగమని, ఇక్కడ పూజలు చేయడానికి అనుమతి ఇవ్వరాదని వాదించింది. జిల్లా కోర్టు తీర్పును అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేస్తామని ప్రకటించింది. అయితే, అంతకుముందే హైకోర్టులో కేవియట్ పిటిషన్ వేయనున్నట్టు హిందూ పిటిషనర్ తరఫు న్యాయవాది జైన్ తెలిపారు.

**మసీదు కమిటీకి హైకోర్టు నోటీసు**

జ్ఞానవాపి మసీదు సముదాయంలో ఉన్న వజూఖానా (కాళ్లు, చేతులు కడుక్కొనే స్థలం)లో భారత పురాతత్వ అధ్యయనాల సంస్థ (ఏఎస్‌ఐ) చేత సర్వే జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు స్పందించింది. అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీకి బుధవారం నోటీసు ఇచ్చింది. ఇక్కడ సర్వే చేయించడానికి వారణాసి కోర్టు తిరస్కరించడంతో హిందూ భక్తురాలు రాఖీసింగ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. వజూఖానా ప్రాంతంలో సర్వే చేయడం చాలా ముఖ్యమని పిటిషన్‌లో పేర్కొన్నారు. సర్వే చేస్తే దీని మతపరమైన లక్షణం ఏమిటో వెల్లడవుతుందని కోర్టుకు తెలిపారు. రాఖీసింగ్ పిటిషన్‌ను వారణాసి జిల్లా కోర్టు 2023 అక్టోబరు 21న తిరస్కరించింది. 'శివలింగం' ఉన్నదని చెప్తున్న ప్రాంతాన్ని పరిరక్షించాలని సుప్రీంకోర్టు 2022 మే 17న తీర్పు చెప్పినందువల్ల ఇప్పుడు అదే ప్రదేశంలో సర్వేకు అనుమతించలేమని జిల్లా కోర్టు తెలిపింది. ఈ జిల్లా కోర్టు గత ఏడాది జూలై 21న ఏఎస్‌ఐకి ఇచ్చిన ఆదేశాల్లో వజూఖానా మినహా మిగిలిన మసీదు ప్రాంగణంలో సవివరమైన సైంటిఫిక్ సర్వే చేయాలని తెలిపింది. దేవాలయంపైన మసీదును నిర్మించారా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు అవసరమైన చోట తవ్వకాలు కూడా జరిపేందుకు అనుమతి ఇచ్చింది.

# మాకు ఓటెయ్యకుంటే గ్యారెంటీలు ఆపేస్తాం

**ప్రజలకు కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలకృష్ణ బెదిరింపులు**

బెంగళూరు, జనవరి 31: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి అత్యధిక సీట్లలో గెలిపించకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఐదు గ్యారెంటీలను నిలిపేస్తామని ప్రజలను అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌సీ బాలకృష్ణ బహిరంగంగానే హెచ్చరించారు. ఈ అంశంపై తాను సీఎం సిద్ధరామయ్యతోనూ, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తోనూ మాట్లాడినట్టు ప్రకటించారు. బీజేపీ, సంఘ్‌పరివార్ పంచుతున్న అక్షింతలు కావాలో, కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ఐదు గ్యారెంటీలు కావాలో తేల్చుకోవాలని సూచించారు. మగడి అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన, ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం మరో ఐదేండ్లు అధికారంలో ఉంటది. మీ ఓటు అక్షింతలకు వేస్తారా? ఐదు గ్యారెంటీలకు వేస్తారా?' అని ప్రశ్నించారు. 'మేమంతా హిందువులమే. అయోధ్యలో రామాలయం కట్టడం సంతోషమే. కానీ ఆలయం పేరుతో ఓట్లు అడగటం సరి కాదు. ఒకవేళ మీరు ఆలయానికే (బీజేపీ) ఓట్లు వేస్తే.. ప్రజలు మా ఐదు గ్యారెంటీలను వద్దని తిరస్కరించినట్టు భావిస్తాం' అని పేర్కొన్నారు. బాలకృష్ణ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికలకు ముందే కాంగ్రెస్ ఓటమిని అంగీకరించిందని పేర్కొన్నది. బోగస్ గ్యారెంటీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఓట్లెయ్యకుంటే గ్యారెంటీలను అమలు చేయబోమని బ్లాక్‌మెయిల్‌కు దిగడం సిగ్గుచేటని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర విమర్శించారు.



డీకే శివ కుమార్‌తో బాలకృష్ణ

## తమిళ నాడులో సీఏఏ అమలు చేయం

**తేల్చిచెప్పిన ముఖ్యమంత్రి స్టాలిన్**

చెన్నై, జనవరి 31: వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని తమిళనాడులో ఎట్టిపరిస్థితుల్లో అమలు చేయబోమని ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ తేల్చిచెప్పారు. వారం రోజుల్లో దేశవ్యాప్తంగా సీఏఏను అమలు చేస్తామని కేంద్రమంత్రి, బీజేపీ నేత శాంతనూ ఠాకూర్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం స్టాలిన్ సోషల్ మీడియా ఎక్స్‌లో స్పందించారు. 'పౌరసత్వ సవరణ చట్టం వివక్షపూరితంగా ఉన్నది. ముస్లింలు, శ్రీలంక తమిళుల గురించి పట్టించుకోకుండా ఈ చట్టాన్ని రూపొందించారు. పార్లమెంట్‌లో దీనికి అనుకూలంగా ప్రతిపక్ష అన్నాడీఎంకే ఓటు వేసింది. పక్షపాత వైఖరితో కూడిన ఈ చట్టాన్ని తమిళనాడులో అసలు అమలు చేయబోం' అని స్పష్టంచేశారు.

## ఆలయాల్లోకి హిందూయేతరులను అనుమతించొద్దు!

- ఆలయాలు పిక్‌నిక్ స్పాట్ కాదు
- ధ్వజ స్తంభం దాటి రాకూడదని తెలుపుతూ బోర్డులు పెట్టాలి
- తమిళ నాడు ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు ఆదేశం

మదురై, జనవరి 31: దేవాలయాల్లోకి హిందూయేతర వ్యక్తుల ప్రవేశంపై మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. అన్ని ఆలయాల్లో హిందూయేతర మతాలకు చెందిన వ్యక్తులను ఆలయ ప్రవేశాల వద్ద ఉండే ధ్వజ స్తంభం దాటి అనుమతించొద్దని, ఈ విషయాన్ని తెలుపుతూ ఆలయ ప్రాంగణంలో బోర్డులు ఏర్పాటు చేయాలని తమిళనాడు దేవాదాయ శాఖను మంగళవారం ఆదేశించింది. ఆలయాలు 'పిక్‌నిక్ స్పాట్' కాదని వ్యాఖ్యానించిన న్యాయస్థానం.. హిందువులకు తమ మతాన్ని విశ్వసించే, ఆచరించే ప్రాథమిక హక్కు ఉన్నదని, అందుకు భంగం వాటిల్లకూడదని మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ స్పష్టం చేసింది. డీ సెంథిల్ కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ శ్రీమతి ఈ మేరకు తీర్పునిచ్చారు. అరుల్మిగు పళని దండాయుతపాణి స్వామి ఆలయం, దాని ఉప ఆలయాల్లో హిందువులను మాత్రమే ప్రవేశాన్ని అనుమతించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరుతూ సెంథిల్ ఈ పిటిషన్ వేశారు. ఆ మేరకు ఆలయాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని కూడా ఆయన కోరారు.




**అండర్‌టేకింగ్ తీసుకొని అనుమతించాలి**

పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. హిందూ మతం పట్ల విశ్వాసం లేని వారిని ఆలయాల్లోకి అనుమతించొద్దని ఆదేశించింది. ఒకవేళ ఎవరైనా హిందూయేతర వ్యక్తి వస్తే అధికారులు తనకు సదరు దేవతామూర్తి పట్ల విశ్వాసం ఉన్నదని, హిందూ మత, ఆలయ పద్ధతులను పాటిస్తానని పేర్కొంటూ అండర్‌టేకింగ్ తీసుకోవాలని పేర్కొన్నది. దీనిపై అధికారులు కూడా రిజిస్టర్ నిర్వహించాలని సూచించింది.

## హీరో విజయ్‌తో బీజేపీ పొత్తు!

- గత విభేదాలు పక్కనబెట్టిన కమలం పార్టీ
- తమిళ నాడులో బలపడటమే లక్ష్యంగా పావులు

చెన్నై, జనవరి 31: తమిళనాట సరికొత్త రాజకీయాలకు వచ్చే లోక్‌సభ ఎన్నికలు వేదికగా మారబోతున్నాయి. తమిళ సినీ హీరో విజయ్‌పై విమర్శలు, ఆరోపణలు చేసిన బీజేపీ.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అతనితో జతకట్టేందుకు సిద్ధమవుతున్నది. హీరో విజయ్ స్థాపించబోయే పార్టీతో బీజేపీ రహస్య పొత్తు కుదుర్చుకుంటుందని, తెరవెనుక ఒప్పందానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తమిళనాట ఊహాగానాలు వెలువడుతున్నాయి. విజయ్ పార్టీ-బీజేపీ మధ్య తెరవెనుక పొత్తు ఉంటుందని, కొన్ని స్థానాల్లో బీజేపీ గెలుపు కోసం విజయ్, ఆయన అభిమాన సంఘాలు పనిచేసేలా ఒప్పందం ఉంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతున్నది. దీనికి సంబంధించి బీజేపీ జాతీయ నాయకత్వం నుంచి హీరో విజయ్‌కు సంకేతాలు వెళ్లాయని, అందువల్లే దీనిని బలపరుస్తూ హీరో విజయ్ నుంచి ఇటీవల ఆసక్తికర వ్యాఖ్యలు వెలువడ్డాయని వార్తా కథనాలు వెలువడ్డాయి. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తర్వాత ఆ స్థాయిలో ఫ్యాన్ ఫాలోయింగ్ కలిగిన హీరో విజయ్ ఒక్కరే.

# జార్ఖండ్ సీఎం అరెస్ట్

మొదటిపేజీ తరువాయి...

స్థానిక ప్రత్యేక పీఎంఎల్‌ఏ కోర్టులో ప్రవేశపెట్టి, కస్టడీ విచారణకు రిమాండ్ కోరే అవకాశం ఉన్నదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అరెస్టుకు ముందే ముఖ్యమంత్రి పదవికి సొరేన్ రాజీనామా చేశారు. కొత్త సీఎంగా జేఎంఎం సీనియర్ నేత, రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా ఉన్న చంపై సొరేన్‌ను అధికార పక్షం ప్రతిపాదించింది. హేమంత్ సొరేన్ రాజీనామా అనంతరం చంపై సొరేన్ నేతృత్వంలోని అధికారపక్ష ఎమ్మెల్యేలు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను సాయంత్రం కలిశారు. తనకు 43 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్న నేపథ్యంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఇందుకు గవర్నర్ ఆమోదం తెలిపారని రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. సొరేన్ అరెస్టుకు నిరసనగా ఆదివాసీ సంఘాలు గురువారం జార్ఖండ్ బంద్‌కు పిలుపునిచ్చాయి. అరెస్టును వ్యతిరేకిస్తూ సొరేన్ హైకోర్టును ఆశ్రయించారు.

**రాజీనామా తర్వాతే సంతకం చేస్తా**

రాజీనామా చేసిన తర్వాతనే అరెస్టు మెమోపై సంతకం చేస్తానని హేమంత్ సొరేన్ ఈడీ అధికారులకు స్పష్టం చేసినట్టు తెలుస్తున్నది. దీంతో ఈడీ అధికారులు ఆయన్ను గవర్నర్ వద్దకు తీసుకెళ్లారు.

**సొరేన్ భార్యకు దక్కని సీఎం పగ్గాలు!**

ఈడీ హేమంత్ సొరేన్‌ను అరెస్టు చేసే పక్షంలో ఆయన భార్య కల్పనా సొరేన్‌కు ముఖ్యమంత్రి పగ్గాలు అప్పగిస్తారనే ప్రచారం సాగింది. అయితే అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది నవంబర్‌లో జరుగునుండటం.. సమయం ఎక్కువగా లేకపోవడంతో పార్టీ ఆ ఆలోచనను విరమించుకొన్నట్టు తెలిసింది. కల్పనా సొరేన్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా కూడా లేరు. రాష్ట్ర అసెంబ్లీ టర్మ్ చివరి ఏడాదిలో ఉప ఎన్నికలు నిర్వహించేందుకు వీలు లేనందున.. ఒకవేళ ఆమెను కొత్త సీఎంగా ప్రతిపాదించినా, ఆమె ఎమ్మెల్యేగా ఎన్నికయ్యేందుకు అవకాశం ఉండదు. మరోవైపు కల్పనా సొరేన్‌ను సీఎం చేసే ఆలోచనను కూడా జేఎంఎం అధినేత శిబు సొరేన్ పెద్ద కోడలు, గత 14 ఏండ్లుగా ఎమ్మెల్యేగా కొనసాగుతున్న సీతా సొరేన్ వ్యతిరేకించారు.

**ఏంటీ మనీలాండరింగ్ కేసు?**


జార్ఖండ్‌లో రూ.600 కోట్ల విలువైన భూ కుంభకోణం జరిగిందనే ఆరోపణలపై ఈడీ విచారణ చేస్తున్నది. ఓ ప్రభుత్వ భూమి యాజమాన్యాన్ని మార్చి, ల్యాండ్ మాఫియాకు అమ్మేందుకు అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నది. ఈ కేసులో ఇప్పటి వరకు 14 మంది అరెస్టు అయ్యారు.



జార్ఖండ్ గవర్నర్‌కు రాజీనామా లేఖను అందజేస్తున్న హేమంత్ సొరేన్

**ఈడీ అధికారులపై సొరేన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు**

ఢిల్లీలోని తన నివాసంలో సోమవారం ఈడీ సోదాలు చేయడంపై హేమంత్ సొరేన్ పోలీసులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ఫిర్యాదు చేశారు. దర్యాప్తు సంస్థ అధికారులపై ఆయన రాంచీలోని పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టారు. సొరేన్ ఫిర్యాదు మేరకు కొంత మంది ఈడీ సీనియర్ అధికారులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామని రాంచీ సీనియర్ ఎస్పీ చందన్ కుమార్ సిన్హా తెలిపారు. తనను వేధించడంతో పాటు తనను, తన కమ్యూనిటీ మొత్తాన్ని అవమానించేందుకు, అపఖ్యాతి పాల్జేసేందుకు ఈడీ ఈ సోదాలు చేపట్టిందని సొరేన్ ఆరోపించారు. అధికారుల చర్యల వలన తాను, తన కుటుంబసభ్యులు మానసిక క్షోభను అనుభవించామని సొరేన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఢిల్లీలోని తన నివాసంలో సోదాల సందర్భంగా ఈడీ అధికారులు సీజ్ చేసిన కారు, స్వాధీనం చేసుకొన్న నగదు తనది కాదని అందులో చెప్పారు.



**జార్ఖండ్ టైగర్.. చంపై సొరేన్**

చంపై సొరేన్ సెరైకెల్లా నియోజకవర్గం నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జేఎంఎంలో చేరకముందు ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిపొందారు. ప్రస్తుతం రవాణాశాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ మంత్రిగా ఉన్నారు. జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన చంపై..'జార్ఖండ్ టైగర్'గా పేరొందారు. హేమంత్ సొరేన్ తండ్రి శిబు సొరేన్‌కు అత్యంత ఆప్తుడిగా, ప్రస్తుత రాష్ట్ర మంత్రివర్గంలో అత్యంత సీనియర్ మంత్రిగా ఉన్నారు. 2010-13లో అర్జున్ ముండా నేతృత్వంలోని బీజేపీ సర్కార్‌లోనూ మంత్రిగా పనిచేశారు. రైతు కుటుంబంలో పుట్టిన ఆయన.. పదో తరగతి వరకు చదువుకున్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, నలుగురు కుమారులు ఉన్నారు.

# నేడు కేంద్ర తాత్కాలిక బడ్జెట్

- ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- మోదీ రెండో పర్యాయంలో ఇదే చివరి బడ్జెట్

న్యూఢిల్లీ, జనవరి 31: కొద్ది నెలల్లో దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న క్రమంలో ప్రధాని మోదీ రెండో విడత పాలనలో ఆఖరి బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టనున్నారు. పార్లమెంట్‌లో గురువారం ఉదయం 11 గంటలకు ఆమె తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ మధ్యంతర బడ్జెట్‌లో తాయిలాలు ఉండవచ్చునని భావిస్తున్నారు. అన్ని రంగాల్లో మహిళలకు ప్రాతినిధ్యం ఉండాలని, మహిళా సాధికారిత పెరగాలని డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో ఈ సారి బడ్జెట్‌లో వారికి పెద్దపీట వేయొచ్చని విశ్లేషకులు చెప్తున్నారు. అలాగే కేంద్రం తెచ్చిన నల్ల చట్టాలతో రైతులలో ఉన్న వ్యతిరేకతను చల్లార్చడానికి వారికి తాయిలాలు ఉండవచ్చని భావిస్తున్నారు. ఆదాయపు పన్నులో మరింత ఊరట ఇవ్వాలని వేతన జీవులు కోరుతున్నారు. వరుసగా ఆరోసారి బడ్జెట్ ప్రవేశపెడుతున్న నిర్మల.. ప్రధాని మోదీ 10 ఏండ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమం, దేశాన్ని ముందుకు తీసుకెళ్లిన విధానాలను వివరించే రాజకీయ పత్రంగా ఈ బడ్జెట్ ఉంటుందని పలువురు ఆర్థిక నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. సాంకేతికంగా ఓటాన్ అకౌంట్‌గా వ్యవహరించే ఈ మధ్యంతర బడ్జెట్‌లో పేర్కొన్న కేటాయింపులకు ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన మొదటి నాలుగు నెలల పాటు నిధులను ఖర్చు చేయడానికి పార్లమెంట్ అనుమతి తప్పనిసరి. ఏప్రిల్/మే నెలలో కొత్త ప్రభుత్వం ఎన్నికైన తర్వాత బహుశా జూలైలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.



**శతాబ్దాల కల రామమందిరం**

- ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ముర్ము

అయోధ్యలో రామమందిరం నిర్మించాలన్న శతాబ్దాల కలను మోదీ ప్రభుత్వం సాకారం చేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమైన నేపథ్యంలో ఉభయ సభలనుద్దేశించి ఆమె ప్రసంగించారు. కొత్త పార్లమెంట్ భవనంలోని లోక్‌సభ చాంబర్‌లో మాట్లాడుతూ గత పదేండ్లలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను చెప్పుకొచ్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దీటైన జవాబునిచ్చిన సాయుధ దళాల సేవలను కొనియాడారు. గత పదేండ్లలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు ఆర్థిక సంస్కరణలను ప్రస్తావించారు. పదేండ్లకు ముందు ఐదు బలహీన దేశాల జాబితాలో ఉన్న భారత్ ఇప్పుడు ఐదు సంపన్న దేశాల జాబితాలో చేరిందని చెప్పారు.

## పోటీ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే పదేండ్ల జైలు!

- రూ.కోటి వరకు జరిమానా
- 5న పార్లమెంట్‌లో బిల్లు

న్యూఢిల్లీ, జనవరి 31: పోటీ పరీక్షల్లో అక్రమాలను నిరోధించడానికి కేంద్రం ఒక చట్టాన్ని తీసుకు రానుంది. దీనికి సంబంధించిన బిల్లును వచ్చే సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఈ కొత్త బిల్లు ప్రకారం పోటీ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారికి గరిష్ఠంగా 10 ఏండ్ల జైలు శిక్షతో పాటు రూ.కోటి వరకు జరిమానా విధిస్తారు. సోమవారం ప్రవేశపెట్టే ఈ బిల్లు విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని తేవడం లేదని, పరీక్షల పేరుతో అక్రమాలకు పాల్పడే మాఫియా, వ్యవస్థీకృత ముఠాలతో పాటు, వీటితో కుమ్మక్కయ్యే ప్రభుత్వ అధికారులు, సిబ్బంది కోసమని ఒక ఉన్నతాధికారి స్పష్టం చేశారు. దీనిపై అధ్యయనం చేసిన అత్యున్నత స్థాయి సాంకేతిక కమిటీ కంప్యూటరైజ్డ్ పరీక్షా విధానం అత్యంత సురక్షితమని సిఫార్సు చేసింది. ముఖ్యంగా జేఈఈతో పాటు కేంద్ర యూనివర్సిటీలతో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలలో అక్రమాల నిరోధానికి ఈ బిల్లును తెస్తున్నారు.

## కేజ్రీవాల్‌కు ఐదోసారి ఈడీ సమన్లు

*న్యూఢిల్లీ, జనవరి 31: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సీఎం కేజ్రీవాల్‌కు తాజాగా మరో మారు సమన్లు జారీచేసింది. ఫిబ్రవరి 2న విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఈ కేసులో కేజ్రీవాల్‌కు సమన్లు జారీకావటం ఇది 5వ సారి. గత నాలుగు నెలలుగా ఈడీ నుంచి వస్తున్న సమన్లను వివిధ కారణాలు చూపుతూ సీఎం కేజ్రీవాల్ వాటిని తిరస్కరిస్తున్నారు. 2023లో నవంబర్ 2, డిసెంబర్ 21న, ఈ ఏడాదిలో జనవరి 3, 18న సమన్లు జారీ అయ్యాయి. ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించి చార్జ్‌షీట్‌లో సీఎం కేజ్రీవాల్ పేరును ఈడీ పలు మార్లు ప్రస్తావించింది. ఈ కేసులో ఇప్పటికే ఆప్ నాయకులు మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్, పలువురు వ్యాపారవేత్తల్ని ఈడీ అరెస్టు చేసింది. తమ నాయకుడికి సమన్లు జారీ కావటంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) స్పందించింది. సమన్లను తమ లీగల్ టీమ్ పరిశీలిస్తున్నదని ఆప్ తెలిపింది. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నది.*



**● ఇండిగో విమానం రద్దు.. ప్రయాణికుల నిరసన**



*ఢిల్లీ నుంచి దియోగఢ్ (జార్ఖండ్)కు వెళ్లాల్సిన విమానం హఠాత్తుగా రద్దు కావటంతో ఢిల్లీ విమానాశ్రయంలో కొందరు ప్రయాణికులు నిరసనకు దిగారు. 'బంద్ కరో.. బంద్ కరో' అంటూ కొంతమంది ప్రయాణికులు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం ఆందోళన చేపట్టారు. తాము ప్రయాణించాల్సిన విమానం హఠాత్తుగా రద్దు కావటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.*

## హెచ్-1బీ మోసాలకు చెక్

- *లాటరీ ప్రక్రియ ప్రక్షాళన కోసం అమెరికా కొత్త నిబంధనలు*

*వాషింగ్టన్: హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మోసాలకు చెక్ పెట్టేందుకు అమెరికా కీలక నిర్ణయం తీసుకున్నది. 2025 ఆర్థిక సంవత్సరానికి జారీచేసే హెచ్-1బీ వీసాల లాటరీ ప్రక్రియను ప్రక్షాళన చేసేందుకు కొత్త నిబంధనలు ప్రకటించింది. దీంతో ఇకపై వీసా కోసం ఎవరు ఎన్ని దరఖాస్తులు చేసుకున్నా ఒకే దరఖాస్తుగా పరిగణిస్తారు. ఒకే వ్యక్తి తరపున అనేక దరఖాస్తులు సమర్పించి లాటరీ విధానంలో ప్రయోజనం పొందేందుకు పలు కంపెనీలు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ నిబంధనను ప్రవేశపెట్టారు. పిటిషన్ల సంఖ్యతో నిమిత్తం లేకుండా దరఖాస్తుదారులందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) వెల్లడించింది. కొత్త నిబంధనల ప్రకారం ప్రతి దరఖాస్తుదారుడు సరైన పాస్‌పోర్టు వివరాలు, ప్రయాణ పత్రాలను విధిగా సమర్పించాల్సి ఉంటుందని, తప్పుడు సమాచారం ఉన్న దరఖాస్తులను తిరస్కరించే అధికారం యూఎస్‌సీఐఎస్‌కి ఉంటుందని స్పష్టం చేసింది. 2025 వీసాల తొలి రిజిస్ట్రేషన్ మార్చి 6 నుంచి 22 వరకు కొనసాగుతుందని తెలిపింది.*

